


మలక్‌పేట నియోజకవర్గ టీఆర్‌ఎస్ అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డికి మద్దతుగా మూసారంబాగ్‌లో శనివారం రాత్రి జరిగిన రోడ్డు షోలో మాట్లాడుతున్న ఐటీశాఖ మంత్రి కేటీఆర్, (చిత్రంలో) మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి

బీసీలకు అన్ని రంగాల్లో రిజర్వేషన్లు కల్పిస్తాం

ఎల్‌బీనగర్ కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్

వనస్థలిపురం: బీసీల రిజర్వేషన్ తగ్గించిన బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు బొంద పెట్టబోతున్నారని, అన్ని సర్వేలలో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బ్రహ్మరథం పడుతున్నారని కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి మధుయాష్కీ గౌడ్ అన్నారు. శనివారం నాగోల్ డివిజన్‌లోని కాత్యాయని గార్డెన్స్‌లో జరిగిన బీసీ బహుజన సంఘాల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధుయాష్కీ గౌడ్ మాట్లాడుతూ, జనాభాలో 50 శాతానికి పైగా, ఎల్‌బీనగర్‌లో 3 లక్షలకు పైగా ఉన్న బీసీలకు 3 కోట్ల రూపాయలు విడుదల చేసినట్లు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మేనిఫెస్టోలో ఉందని, అంటే మనిషికి 100 రూపాయలని, ఇంతకంటే అవమానం ఇంకొకటి



నాగోల్‌లో బీసీ బహుజన సంఘాల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మధుయాష్కీ గౌడ్

ఉంటుందా అని అన్నారు. చదువుకునే అవకాశం ఇస్తే రాజ్యాధి కారం కోరుతారనే ఉద్దేశంతో బీసీలను చదువుకు దూరం చేసే కుట్ర చేస్తున్నారన్నారు. కేంద్రంలో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాబోతుందని, తాము అధికారంలోకి రాగానే రాహుల్‌గాంధీ చెప్పిన విధంగా బీసీ జనగణన, కులగణన చేస్తామని, అన్ని రంగాలలో రిజర్వేషన్లు కల్పిస్తామన్నారు. బీసీలకు కులాల వారీగా కార్పొరేషన్లు ఏర్పాటు చేస్తామన్నారు. దొరల దోపిడీ పాలనకు అంతం పలకాలంటే హస్తం గుర్తుకు ఓటేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ ప్రచార కమిటీ కో కన్వీనర్ వజీర్ ప్రకాష్‌గౌడ్, గోపా అధ్యక్షుడు మిద్దెల రమేష్ బాబు, చెరకు చిరంజీవి, స్వతిన్, శైలజ రెడ్డి, నిర్మల పాల్గొన్నారు.

న్యాయవాదుల ఆత్మీయ సమ్మేళనంలో...

తెలంగాణ ఉద్యమంలో న్యాయవాదులు కీలక పాత్ర పోషించారని, కాంగ్రెస్ పార్టీ అభయ హస్తం మేనిఫెస్టోలో న్యాయవాదులకు ఉపయోగపడే అనేక అంశాలను చేర్చామని మధుయాష్కీ గౌడ్ అన్నారు. ఎల్‌బీనగర్‌లోని సురభి ఎలైట్‌లో దేవరాజ్, ప్రభాకర్‌ల ఆధ్వర్యంలో శనివారం జరిగిన రంగారెడ్డి జిల్లా కోర్టు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ న్యాయవాదుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు.

బీజేపీ గెలుపే జనసేన గెలుపు: పవన్ కల్యాణ్



వనస్థలిపురం రైతుబజార్ వద్ద మాట్లాడుతున్న పవన్‌కల్యాణ్ (చిత్రంలో) ఎల్బీనగర్ బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డి తదితరులు

వనస్థలిపురం: బీజేపీ గెలుపే జనసేన గెలుపని ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ అన్నారు. బీజేపీకి మద్దతుగా శనివారం వనస్థలిపురం రైతు బజారు వద్ద నిర్వహించిన కార్నర్ మీటింగ్‌కు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ, ఎల్‌బీనగర్ బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డిని గెలిపించడానికి జనసైనికులు మనస్ఫూర్తిగా పనిచేయాలని సూచించారు. ఆంధ్రలో టీడీపీతో పొత్తులాగానే తెలంగాణలో జనసేన పొత్తు ఉందని అన్నారు. నరేంద్రమోదీ నాయకత్వాన్ని బలపరచాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డి, జనసేన ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి శిరీష, బీజేపీ కార్పొరేటర్లు రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, కొప్పుల నవజీవన్‌రెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి, వంగ మధుసూదన్‌రెడ్డి, నాయకులు కొత్త రవీందర్‌గౌడ్, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్‌యాదవ్, టి.విజయ్‌కుమార్, నూతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వారు ప్రభుత్వ భూముల పాలిట గద్దలు

– ఎల్‌బీనగర్ బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డి

మన్సూరాబాద్: ప్రభుత్వ భూముల పాలిట బీఆర్ఎస్ పెద్దలు గద్దలుగా వాలి స్వాహా చేస్తున్నారని బీజేపీ ఎల్‌బీనగర్ అభ్యర్థి సామ రంగారెడ్డి ధ్వజమెత్తారు. ఎల్‌బీనగర్‌లోని మాల్ మైసమ్మ ఆలయ సమీపంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎల్‌బీనగర్ నడిబొడ్డున ఉన్న సిరీస్ కంపెనీ 36.16 ఎకరాల స్థలాన్ని మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కలిసి కబ్జా చేశారని ఆరోపించారు. సిరీస్ భూములను కబ్జా చేసినట్టు నేను ఆధారాలతో నిరూపిస్తా...కాదు తప్పని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆధారాలతో నిరూపిస్తే తాను ఎన్నికల బరి నుంచే కాకుండా శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ చేశారు. కార్పొరేటర్లు బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, నాయికోటి పవన్‌కుమార్, నాయకులు విజయభాస్కర్, కృష్ణంరాజు, గుండే కిరణ్‌కుమార్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు. కాగా, బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డితో కలిసి బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డి శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

రైతు వ్యతిరేక పార్టీలను సాగనంపాలి

– బీఆర్ఎస్ మహేశ్వరం అభ్యర్థి సబితారెడ్డి

మహేశ్వరం: కాంగ్రెస్, బీజేపీ పార్టీలు రైతుల పాలిట శత్రువులుగా మారాయని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మోహబ్బత్‌నగర్, తుమ్మలూరు, నాగులోని తండా, దయాల్ గుండు తండా, కేసీ తండా, మహేశ్వరం టౌన్‌లలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహేశ్వరం నియోజకవర్గంలో వందలాది రూపాయల నిధులతో అభివృద్ధి పనులు చేశానని, మరింత అభివృద్ధి చేసేందుకు కారు గుర్తుకు ఓటు వేసి తనను మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు నర్సింహ, ఎంపీపీ సునీతానాయక్, జిల్లా రైతు కమిటీ సభ్యుడు యాదయ్య పాల్గొన్నారు.



తుమ్మలూరులో ప్రచారం చేస్తున్న సబితారెడ్డి

కమీషన్లకు కక్కుర్తి పడుతున్న ఎంఐఎం : షేక్ అక్బర్

చాదర్‌ఘాట్: వేసిన రోడ్లనే మళ్లీ వేస్తూ ప్రజాధనాన్ని కాంట్రాక్టర్లకు దోచిపెడుతూ ఎంఐఎం నాయకులు కమీషన్లకు కక్కుర్తి పడుతున్నారని కాంగ్రెస్ అభ్యర్థి షేక్ అక్బర్ ఆరోపించారు. శనివారం ఆయన ఓల్డ్‌మలక్‌పేట డివిజన్‌లోని వాటర్‌ట్యాంక్, సద్దాం హోటల్, న్యూవాహెద్‌నగర్ ప్రచారం నిర్వహించారు. హస్తం గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని ప్రజలను కోరారు.

అధికారం కోసమే ప్రతిపక్షాల అసత్య ప్రచారం

ఎల్బీనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: అధికారం కోసం ప్రతిపక్ష నాయకులు తనపై నిరాధారమైన ఆరోపణలు చేస్తూ అసత్య ప్రచారం చేస్తున్నారని, నన్ను మూసీలో కలపడం కాదు.. ప్రజలే మిమ్మల్ని సెప్టిక్ ట్యాంక్‌లో వేసి తొక్కుతారని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం ఎల్‌బీ నగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, తానెప్పుడూ స్వలాభం చూసుకోలేదని, నియోజకవర్గం అభివృద్ధే తన అభివృద్ధిగా ముందుకు వెళ్తున్నానని అన్నారు. రేవంత్ రెడ్డి ఎంపీగా గెలిచి ఐదేళ్లు కావస్తున్నా ఇంత వరకు నియోజవర్గంలో పర్యటించింది లేదని, కనీసం నిధులు కూడా కేటాయించలేదని, అలాంటి వారిని ప్రజలు తరిమి కొట్టడం ఖాయమన్నారు. నిజామాబాద్‌లో రెండుసార్లు ఎంపీగా గెలిచిన మధుయాష్కీ గౌడ్ అక్కడ ప్రజలకు ఎలాంటి పని చేయలేదని, అక్కడ గెలిచే అవకాశం లేకపోవడంతో ఎల్‌బీనగర్‌కు వచ్చి మాయమాటలు చెప్తున్నాడని ఆరోపించారు. బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులపై 420 కేసులు ఉన్నాయని, ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించి ఇతరుల ఆస్తులు దోచుకున్న ఘనత వారికే దక్కుతుందన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకునేందు మార్నింగ్ వాక్‌తో కాలనీలలో పర్యటించే పవిత్రమైన కార్యక్రమాన్ని దొంగలే తెల్లారక ముందు వస్తారంటూ అవమానించడం బాధాకరమన్నారు. సూర్యుడు కంటే ముందే ఈ సుధీర్‌రెడ్డి వెళ్లి ప్రజల కష్టాలతో తోడు ఉంటాడని అన్నారు. తమ తప్పులు కప్పిపుచ్చుకొనేందుకు, అధికారం కోసమే ప్రతిపక్ష నాయకులు తనపై వ్యక్తిగత దూషణకు దిగుతున్నారన్నారు. ప్రజలను ఎవరు ఎంత మభ్యపెట్టాలని చూసినా చివరకు ఎల్‌బీనగర్‌లో గెలిచేది మాత్రం బీఆర్ఎస్ పార్టీనేనని సుధీర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

ఎల్బీనగర్‌లో గులాబీ జెండా ఎగురవేస్తాం...



శుభోదయ కాలనీలో మాట్లాడుతున్న సుధీర్‌రెడ్డి

చంపాపేట: ఎల్‌బీనగర్‌లో భారీ మెజారిటీతో గులాబీ జెండా ఎగురవేసి ఘన విజయాన్ని కేసీఆర్‌కు కానుకగా ఇస్తామని ఎల్‌బీనగర్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం చంపాపేట డివిజన్ పరిధిలోని బైరామల్‌గూడ హనుమాన్ ఆలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి లక్ష్మీనగర్, మాధవనగర్, డిఫెన్స్, దుర్గానగర్, శుభోదయ, నిర్మలానగర్, హనుమాన్‌నగర్, శ్రీనిధి, రాఘవేంద్ర, క్రాంతినగర్, పద్మానగర్, సాయిరాంనగర్, యాదగిరినగర్ తదితర కాలనీలలో ఇంటింటికీ వెళ్లి కారు గుర్తుపై ఓటు వేసి మరోమారు తనను ఆశీర్వదించాలని కోరారు.

కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం

కేఎల్లార్‌కు మద్దతుగా జోరుగా ప్రచారం

మహేశ్వరం: మహేశ్వరం గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని ఆ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ కోరుపోలు రఘుమారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఘట్టుపల్లి, ఆకన్‌పల్లి, అమీర్‌పేట్, కోళ్లపడకల్, నందుపల్లి, తుమ్మలూరు గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. నాయకులు యాదయ్య, కుమార్, ప్రవీణ్, చంద్రమోహన్, శ్రీకాంత్, రాజేందర్, పాండు, ప్రవీణ్, ఆనంద్, నర్సింహ భిక్షపతి, జంగయ్య, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు: కేఎల్లార్ సమక్షంలో పార్టీలో చేరిన నాయకులు

కాంగ్రెస్‌లో చేరికలు

కందుకూరు: మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి ఆధ్వర్యంలో శనివారం కేఎల్లార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన హన్మంత్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, కిషన్, ప్రభాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులకు కండువాలు కప్పి ఆహ్వానించారు. యాదయ్య పాల్గొన్నారు.

కేసీఆర్ మోసపూరిత హామీలను నమ్మొద్దు: దేప

దిల్‌సుఖ్‌నగర్: తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని గెలిపించి సోనియాగాంధీ రుణం తీర్చుకోవాలని మహేశ్వరం నియోజకవర్గం సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దేప భాస్కర్ రెడ్డి అన్నారు. శనివారం ఆర్‌కేపురం డివిజన్ వాసవి కాలనీ, హరిపురి కాలనీ, లక్ష్మీనగర్, యాదవ్ నగర్ కాలనీల్లో సీనియర్ కాంగ్రెస్ మహిళా నాయకురాలు తమలపాకుల హర్షలత, యువజన నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డితో కలిసి మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డికి మద్దతుగా ప్రచారం చేస్తూ ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు.



వాసవి కాలనీలో ప్రచారం చేస్తున్న దేప భాస్కర్ రెడ్డి తదితరులు

డబుల్ ఇంజిన్ సర్కార్‌తో మరింత ప్రగతి సాధ్యం

– బీజేపీ అభ్యర్థి సంరెడ్డి సురేందర్‌రెడ్డి

మలక్‌పేట: డబుల్ ఇంజిన్ సర్కార్‌తో మరింత ప్రగతి సాధ్యమని బీజేపీ మలక్‌పేట అభ్యర్థి సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. స్థానిక కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం చేపట్టిన పాదయాత్రలో ఆయన పాల్గొన్నారు. మూసారంబాగ్, సలీంనగర్‌లో ఇంటింటికీ ప్రచారం చేశారు. ఈ ఎన్నికల్లో బీజేపీ కమలం పువ్వు గుర్తుకు ఓటేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.